27.10.2024


# క్విక్ టుడే

QUICK TODAY DAILY తెలుగు దినపత్రిక

EDITOR: GILLALA BUCHI REDDY
8125972476

EVENING EDITION RNI NO: TELTEL/2023/86487 QUICKTODAYNEWS.COM

## దీపావళికి రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' టీజర్?



మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రాబోతున్నట్లు తెలుస్తుంది. 'గేమ్ ఛేంజర్ టీజర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు సమాచారం. ఈ మూవీ టీజర్‌ను దీపావళికి ప్లాన్ చేస్తున్నట్లు టాక్. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.



- బియ్యం పథకంపై కొరవడిన అజమాయిషీ
- రేషన్ బియ్యంతో వ్యాపారం చేస్తున్న దళారులు
- యథేచ్ఛగా నల్ల బజారుకు రాయితీ బియ్యం
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ఆగని రేషన్ దందా

అమ్మకానికి

# చౌక బియ్యం

ధరలు పెంచితే ఎక్కడ ఓట్లు గల్లంతవుతాయో అన్న భయం పాలకులను వెన్నాడుతున్నట్లుగా ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ధాన్యం కొనండని రైతులు చేస్తున్న ఆందోళనలను గుర్తించి వారికి అండగా నిలవాలి.

చౌక బియ్యాన్ని తినడాని కన్నా అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరి కొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హొటళ్లలో టిఫిన్లు తయారవుతున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. ఈ విషయాలన్నీ ప్రజందరికీ తెలుసు. రాజకీయ నాయకులు కూడా తెలుసు. కానీ ఎవరు కూడా దీనిపై చర్చించడం లేదు. ఎక్కడా ప్రస్తావించడం లేదు. తమకెందుకులే అన్న నిర్లిప్తతతే ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారింది. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు.

**హైదరాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్)**

తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. దీనిని కూడా గుర్తించడం లేదు. ధరలు పెంచితే ఎక్కడ ఓట్లు గల్లంతవుతాయో అన్న భయం పాలకులను వెన్నాడుతున్నట్లుగా ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ధాన్యం కొనండని రైతులు చేస్తున్న ఆందోళనలను గుర్తించి వారికి అండగా నిలవాలి. కిలోబియ్యం పథకం దుబారాను తగ్గించి వాటిని ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించాలి. కార్డులు తగ్గించడం కన్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం. ఇప్పటికైనా ఈ అక్రమాలను గుర్తిస్తే ఖజానాపై భారం తప్పుతుంది.

## ముంబై రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

**ముంబై, అక్టోబర్ 27 :** దీపావళి పండుగ నేపథ్యంలో మహారాష్ట్ర రాజధాని ముంబైలోని రైల్వేస్టేషన్‌లు కిక్కిరిసిపోయాయి. జనం సొంతూళ్లకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లకు పోటెత్తారు. దీంతో ముంబైలోని బాంద్రా టెర్మినస్‌లో ఆదివారం ఉదయం భారీ తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. వందలాది మంది ప్రయాణికులు బాంద్రా టెర్మినస్‌లోని ప్లాట్ ఫామ్ నంబర్ 1 పై వేచిచూస్తుండగా.. బాంద్రా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు వెళ్లాల్సిన నంబర్ 22921 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్ ఫామ్ మీదికి రాగానే జనం ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు పరుగులు తీశారు. ఒక్కసారిగా తొక్కిసలాట చోటుచేసుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ విషాద ఘటన 5.56 గంటలకు సంభవించింది. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను రైల్వే భద్రత సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ వారిలో ఒకరిద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్లాట్ ఫామ్ నంబర్ 1పై ప్రయాణికులు పోటెత్తడం, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అక్కడికి చేరుకోగానే తోపులాట చోటు చేసుకోవడానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## జనగామ పట్టణంలో భారీ అగ్నిప్రమాదం

### విజయ షాపింగ్ మాల్‌లో ఎగిసిపడిన మంటలు

**జనగామ, అక్టోబర్27 (క్విక్ టుడే న్యూస్):** జనగామ జిల్లా కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జనగామ పట్టణంలోని విజయ షాపింగ్ మాల్ లో ఆదివారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.. షాపింగ్ మాల్ లో ఆదివారం ఉదయం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. కొద్ది సమయంలోనే పక్కన ఉన్న షాపులకు కూడా మంటలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు క్షణాల్లోనే పక్క షాపులకు విస్తరించాయి. స్థానికులు, చుట్టుప్రక్కల ప్రాంతాల వారు అప్రమత్తమై పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో విజయ షాపింగ్ మాల్ తో పాటు పక్కనే ఉన్న లక్ష్మి షాపింగ్ మాల్ అగ్నికి ఆహుతయ్యాయి. పక్కనే ఏటీఎం ఉండడంతో బ్యాంక్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సమయానికి ఫైర్ సిబ్బంది మంటలు అర్పడంతో చుట్టుపక్కల షాప్ ల వారు ఊపిరి పీల్చుకున్నారు.



## 4నెలల కిందట మిస్సింగ్

### వీవీఐపీ ప్రాంతంలో మహిళ మృతదేహం

**లక్నో, అక్టోబర్27:** ఒక మహిళ నాలుగు నెలల కిందట అదృశ్యమైంది. అయితే జిల్లా కలెక్టర్ బంగ్లా, ఇతర ప్రభుత్వ అధికారుల నివాసాలు ఉన్న వీవీఐపీ ప్రాంతంలో ఆమె మృతదేహం లభించింది. నిందితుడైన జిమ్ ట్రైనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. జూన్ 24న వ్యాపారవేత్త భార్య సోనీ అదృశ్యమైంది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాన్పూర్‌లోని రాయ్‌పూర్వా ప్రాంతానికి చెందిన జిమ్ ట్రైనర్ విమల్ మహిళతో అదృశ్యమయ్యాడు. తర్వాత అతడి కోసం పూణే, ఆగ్రా, పంజాబ్‌లో పోలీస్ బృందాలు వెతికాయి. అయితే విమల్ మొబైల్ ఫోన్ వాడకపోవడంతో అతడి ఆచూకీ గుర్తించడం ఆలస్యమైంది. చివరకు నిందితుడు విమల్‌ను పోలీసులు అరెస్ట్ ప్రశ్నించగా ఆ మహిళను తానే చంపినట్లు ఒప్పుకున్నాడు. తనకు పెళ్లి సంబంధం కుదరడంతో ఆమె అసంతృప్తి చెందినట్లు తెలిపాడు. ఈ అంశంపై మాట్లాడేందుకు తామిద్దరం కారులో వెళ్లినట్లు చెప్పాడు. వాగ్వాదం సందర్భంగా మహిళ మెడపై తాను పంచ్ ఇవ్వడంతో స్పృహతప్పిందని, దీంతో ఆమెను హత్య చేసినట్లు వెల్లడించాడు.





## రాజ్ పాకాల విల్లాల్లో పోలీసులు దాడులు

- కేటీఆర్ బావమరిదికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ!
- అధికారులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం
- ఉద్రిక్తత నడుమ కొనసాగుతున్న తనిఖీలు

**హైదరాబాద్, అక్టోబర్ 27 (క్విక్ టుడే న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసుల దాడుల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతోంది. తాజాగా, రాయదుర్గం ఓరియన్ విల్లాస్ వద్ద బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. రాయదుర్గంలోని రాజ్ పాకాలకు చెందిన విల్లాలో తనిఖీలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు వెళ్లారు. రాజ్ పాకాల విల్లాకు తాళం వేసి ఉండడంతో ఎక్సైజ్ సిబ్బంది వేచి చూశారు. అక్కడికి దగ్గర్లోనే మరో విల్లాలో రాజ్ పాకాల ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. దాంతో వారు ఆ విల్లాలో తనిఖీ చేసేందుకు యత్నించారు. తనిఖీలకు యత్నించిన ఎక్సైజ్ శాఖ అధికారులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వాగ్వాదానికి దిగారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా తనిఖీలు చేపడతారని బీఆర్ఎస్ నేతలు ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. ఉద్రిక్తత నడుమనే తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ ఎస్ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి తనిఖీలు చేస్తున్నారు.